సాక్షి నిజామాబాద్

బుధవారం । 12 । ఫిబ్రవరి । 2025



పెరగనున్న బీర్ల ధరలు

వేసవికి ముందే బీరు ప్రియులకు షాక్ తగల నుంది. బీర్ల ధర 15శాతం పెంపునకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తోంది.

- 8లో ▸



90 కిలోల గంజాయి..

నిజాంసాగర్ మండలం మాగి చౌరస్తా వద్ద 90.80 కిలోల గంజాయిని పట్టుకున్నట్లు ఎక్సైజ్ డీసీ సోమిరెడ్డి తెలిపారు.

- 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం

37.0 /18.5

ఉదయం ఈదురు గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. రాత్రి చలి తీవ్రత తక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

నామినేషన్ల పరిశీలన పూర్తి

- గ్రాడ్యుయేట్ స్థానం బరిలో 68 మంది.. టీచర్ స్థానానికి 16 మంది

సాక్షిప్రతినిధి,కరీంనగర్: కరీంనగర్–మెదక్–నిజామాబాద్–ఆదిలాబాద్ గ్రాడ్యుయేట్, టీచర్ ఎమ్మెల్సీ స్థానాలకు దాఖలైన నామినేషన్ల పరిశీలన ముగిసింది. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానానికి 100 మంది అభ్యర్థులు 192 నామినేషన్లు దాఖలు చేశారు. వివిధ కారణాలతో 32 మందివి తిరస్కరణకు గురికాగా, 68 మంది నామినేషన్లను ఆమోదించారు. టీచర్ ఎమ్మెల్సీ స్థానానికి 17 మంది 38 నామినేషన్లు దాఖలు చేయగా ఒకరి నామినేషన్ రిజెక్ట్ అయ్యింది. ఈ సందర్భంగా ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ.. అభ్యర్థులు నామినేషన్లు సమర్పించిన సందర్భంలో ఏవైనా లోపాలు ఉంటే గుర్తించి వారికి షార్ట్ మెమోలు ఇచ్చి సరిచేసుకునేందుకు అవకాశం కల్పించామని తెలిపారు. సరైన ఫార్మాట్‌లో సమర్పించని నామినేషన్లను తిరస్కరించినట్లు వివరించారు.

స్థానిక ఎన్నికలకు ఏర్పాట్లు

- కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

నిజామాబాద్ అర్బన్: గ్రామ పంచాయతీ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి చేస్తున్నామని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని 545 గ్రామ పంచాయతీల్లో 5,022 వార్డులకు 5,053 పోలింగ్ కేంద్రాలను గుర్తించామన్నారు. ఎన్నికల నిర్వహణ కోసం 2,531 జంబో బ్యాలెట్ బాక్సులు, 1,380 చిన్న బ్యాలెట్ బాక్సులకు మరమ్మతులు చేయించామన్నారు. ముద్రించిన బ్యాలెట్ పేపర్లు స్ట్రాంగ్‌రూంలో అందుబాటులో ఉన్నాయని, రాష్ట్ర ఎన్నికల సంఘం పంపించిన ఫారాలు, కవర్లు, ఇతర సామగ్రి ఎంపీడీవోలకు అందజేసినట్లు తెలిపారు. రిటర్నింగ్, సహాయ రిటర్నింగ్, ప్రిసైడింగ్, పోలింగ్ అధికారులుగా విధులు నిర్వర్తించే ఉద్యోగులకు ఉత్తర్వులు జారీ చేశామన్నారు. ఈ నెల 15లోగా ఎన్నికల సిబ్బందికి శిక్షణ తరగతులు నిర్వహిస్తామని కలెక్టర్ తెలిపారు.

పన్ను వసూళ్లపై దృష్టి సారించాలి

- బల్దియా కమిషనర్ దిలీప్‌కుమార్

నిజామాబాద్ సిటీ: కార్పొరేషన్ పరిధిలో పన్ను వసూళ్లపై దృష్టి సారించాలని కమిషనర్ దిలీప్‌కుమార్ అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. తన చాంబర్‌లో కమిషనర్ మంగళవారం సాయంత్రం డిప్యూటీ కమిషనర్, రెవెన్యూ ఆఫీసర్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, నోడల్ ఆఫీసర్లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్థిక సంవత్సరం ముగుస్తున్నందున పన్నుతోపాటు ఇతర బకాయిలను వెంటనే వసూలు చేయాలని సూచించారు. ఇప్పటి వరకు కేవలం 30 శాతం మాత్రమే పన్ను వసూలైందని, వంద శాతం వసూలు చేసేందుకు కృషి చేయాలన్నారు. సమావేశంలో డిప్యూటీ కమిషనర్ రాజేంద్రకుమార్, అసిస్టెంట్ కమిషనర్ జయకుమార్, మున్సిపల్ ఈఈ మురళీమోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాడి.. పంటతో ఎనలేని మేలు

పాపారావు వ్యవసాయ క్షేత్రంలో సేంద్రియ సాగు విధానంలో పెంచుతున్న వివిధ రకాల పండ్ల చెట్లు



జైతాపూర్‌లో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన సదస్సు

- సేంద్రియ రైతులకు బ్రాండింగ్ సర్టిఫికెట్ ఇచ్చేందుకు ప్రభుత్వ యోచన
- స్పష్టం చేసిన కేవీకే సమన్వయకర్త, శాస్త్రవేత్త అంజయ్య
- పాల్గొన్న రైతులు, అగ్రికల్చర్ విద్యార్థులు
- ఆదర్శ రైతులకు సన్మానం

రైతులు ‘పాడి.. పంట’ నినాదంతో వ్యవసాయం చేస్తే సమాజానికి ఎనలేని మేలు కలుగుతుందని సేంద్రియ సాగు చేస్తున్న పలువురు రైతులు అభిప్రాయపడ్డారు. రుద్రూర్‌లోని కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) ఆధ్వర్యంలో మంగళవారం ఎడపల్లి మండలంలోని జైతాపూర్‌కు చెందిన ఆదర్శ రైతు కరుటూరి పాపారావు వ్యవసాయ క్షేత్రంలో ‘ప్రకృతి వ్యవసాయం’పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కేవీకే సమన్వయకర్త, శాస్త్రవేత్త అంజయ్య మాట్లాడుతూ.. రైతులు ప్రకృతి వ్యవసాయం దిశగా మళ్లాలన్నారు. సేంద్రియ రైతులకు బ్రాండింగ్ సర్టిఫికెట్ ఇచ్చేందుకు ప్రభుత్వం ప్రణాళికలు తయారు చేస్తోందని తెలిపారు. కార్యక్రమం అనంతరం ఆదర్శ రైతులను సన్మానించారు. సదస్సులో కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త స్వప్న, జిల్లా, చుట్టుపక్కల జిల్లాలకు చెందిన రైతులు, జగిత్యాల వ్యవసాయ కళాశాలకు చెందిన అగ్రికల్చర్ బీఎస్సీ విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సేంద్రియసాగుపై రైతులు తమ అభిప్రాయాలను వేదికపై పంచుకున్నారు.

– సాక్షి ప్రతినిధి, నిజామాబాద్



సేంద్రియ విధానంలో పండిన అరటి

వైవిధ్యమైన పంటలు పండించాలి



ప్రతి రైతు ఆవులను పెంచుకోవాలి. బ్యాంకు అధికారిగా ఉంటూనే ఆవుపేడను పంటలకు వాడాలని 2008 నుంచి అవగాహన కల్పిస్తున్నా. రైతులు ఆవుపేడ వాడి అంతర పంటలు సాగు చేస్తే ఎరువులు, పురుగుమందులు వాడే అవసరం ఉండదు. వర్షాధార పంటలు సైతం సాగుచేయాలి. వరికి బదులు చెరుకు, మిల్లెట్స్ సాగు చేయాలి. చెరుకుతో బెల్లం తయారు చేయాలి.

– రాంగోపాల్‌రెడ్డి, రైతు, విశ్రాంత అధికారి, నిర్మల్



పాపారావు దంపతులను సన్మానిస్తున్న శాస్త్రవేత్తలు, అధికారులు

అన్నదాత.. విషదాత కావొద్దు

అన్నదాతలు విచ్చలవిడిగా రసాయన ఎరువులు, పురుగుమందులు వాడడంతో ప్రజలు విటమిన్స్ బదులు కెమికల్స్ తినాల్సిన దుస్థితి నెలకొంది. అన్నదాతలు విషదాతలు కావొద్దు. రైతులు దేశీరకాలను ఎక్కువగా సాగు చేయాలి. పోషకాలు అధికంగా ఉండే పంటలు పండించొచ్చు.

– పాండురంగారావు, రైతు

మన ఇల్లు.. మన ఊరు.. మన దేశం



మన ఇల్లు.. మన ఊరు.. మన దేశం స్ఫూర్తితో రైతులు సేంద్రియ వ్యవసాయం చేయాలి. రైతులు ముందుగా తమ వ్యవసాయ భూమిలో ఇంటికి సరిపోయేంత స్థలంలో ప్రకృతి వ్యవసాయం చేసి.. విడతలవారీగా సేంద్రియ సాగును పెంచుకుంటూ వెళ్లాలి. పశువులు తినని 21 రకాల ఆకులు సేంద్రియ సాగులో బాగా ఉపయోగపడతాయి. గ్రామం యూనిట్‌గా కాకుండా రైతు యూనిట్‌గా సబ్సిడీలు ఇచ్చి ప్రకృతి సాగును ప్రోత్సహించాలి. జీవామృతం, ఆగ్నేయాస్త్రం, బ్రహ్మాస్త్రం, నీమాస్త్రం, గోకృపామృతం వాడకంపై ప్రభుత్వం అవగాహన కల్పించాలి. – జనార్దన్‌రెడ్డి, సేంద్రియ రైతు



ప్రకృతి సేద్యం వైపు మళ్లాలి

హరిత విప్లవం తరువాత రైతులు రసాయన ఎరువులు, పురుగుమందులు దుర్వినియోగం చేసే స్థాయి లో విచ్చలవిడిగా వాడారు. దీంతో పంట ఉత్పత్తులు భారీగా పెరిగినప్పటికీ ఆస్పత్రుల సంఖ్య మరింతగా పెరిగింది. పంటలు విషం మాదిరిగా పండడంతో ఈ పరిస్థితి వచ్చింది. రైతులు ప్రకృతి సేద్యం వైపు మళ్లాలి. ఒక్క ఆవుతో 30 ఎకరాలు సాగు చేయొచ్చు. తద్వారా పంట, భూమి, పర్యావరణాన్ని కాపాడొచ్చన్నారు. ప్రతి రైతు తనకున్న 5 శాతం భూమిలో ప్రయోగాత్మకంగా ప్రకృతి సాగు మొదలు పెట్టాలి. ప్రభుత్వం ఈ దిశగా ప్రోత్సహించాలి.

– కరుటూరి పాపారావు, ఆదర్శ రైతు

కొత్తది కాదు

పూర్వం మన తాతలు, తండ్రులు చేసిందేప్రకృతి వ్యవసాయం. రైతులు ‘పాడి పంట’ నినాదంతో వ్యవసాయం చేయాలి. ఆవుపేడతో భూసారం పెరిగి పంటలు ఆరోగ్యకరంగా ఉంటాయి. పురుగుమందుల కారణంగా మిత్ర జీవరాశులు అంతరించిపోతున్నాయి.

– వివేకానందరెడ్డి, విశ్రాంత అధికారి

సైంటిస్టులే వస్తున్నారు..

ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలి. గతంలో రైతులు సైంటిస్టుల వద్దకు వెళ్తే ప్రస్తుతం సైంటిస్టులు ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతుల వస్తున్నారు. – నరేందర్‌రెడ్డి, రైతు

యువత వ్యవసాయంలోకి రావాలి

వ్యవసాయ రంగంలో కూలీల కొరత తీవ్రంగా ఉంది. బీహార్, ఉత్తరప్రదేశ్, బెంగాల్ రాష్ట్రాల కూలీలు రావాల్సిన పరిస్థితి ఉంది. యువత వ్యవసాయ రంగంలోకి రావాలి. దేశ ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని రైతులు, అధికారులు, ప్రభుత్వం ముందుకెళ్లాలి. రైతులు పోటీ పడి రసాయన ఎరువులు వాడుతుండడంతో పంటలో శక్తి లేకుండా పోతోంది. – కేపీ శ్రీనివాసరెడ్డి, చెరుకు ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడు

ఇష్టంగా వ్యవసాయం చేయాలి

రైతులు కష్టంగా కాకుండా ఇష్టంగా వ్యవసాయం చేయాలి. అందుబాటులో ఉన్న పశు పేడతోనూ సేంద్రియ సాగు చేయొచ్చు. మార్కెట్‌లో లభిస్తున్న జీవ ఎరువుల విషయంలో జాగ్రత్తగా ఉండాలి. బాక్టీరియా లేని వాటిని అమ్ముతున్నారు. తెగులు రాకముందే జీవ ఎరువులు పిచికారీ చేస్తే మేలు. సేంద్రియ వ్యవసాయంలో ఓపిక ఉండాలి. 3 నుంచి 4 సంవత్సరాల తరువాత నుంచి మాత్రమే దిగుబడి వస్తుంది. – సుబ్బారావు, సేంద్రియ రైతు, జైతాపూర్

బర్డ్ ఫ్లూ భయం!

- జిల్లా సరిహద్దుల మీదుగా కోళ్ల రవాణా నిరోధానికి చర్యలు
- సాలూర, కందకుర్తి వద్ద చెక్‌పోస్టులు ఏర్పాటు

డొంకేశ్వర్(ఆర్మూర్): ఆంధ్రప్రదేశ్ బర్డ్ ఫ్లూపై అలర్ట్ ప్రకటించిన నేపథ్యంలో జిల్లాలో కోళ్ల రవాణా నిరోధానికి అధికారులు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు. మహారాష్ట్ర సరిహద్దులో ఉన్న సాలూర, కందకుర్తి వద్ద చెక్ పోస్టులను ఏర్పాటు చేశారు. చెక్ పోస్టుల వద్ద పశుసంవర్ధక, పోలీసు శాఖలు కలిసి వాహనాలను తనిఖీ చేస్తున్నాయి. బయటి రాష్ట్రాల నుంచి జిల్లాలోకి కోళ్లతోపాటు ఎలాంటి జీవాలను రవాణా చేయకుండా వాహనాలను వెనక్కి పంపుతున్నారు. పశుసంవర్ధక శాఖ నుంచి ఆరుగురు సిబ్బంది చెక్ పోస్టుల వద్ద 24 గంటల పాటు విధులు నిర్వర్తిస్తున్నట్లు ఆ శాఖ జేడీ జగన్నాథచారి తెలిపారు. ఇప్పటికే జిల్లాలో పదిహేనుకు పైగా ఫారాల్లో బర్డ్ ఫ్లూ వంటి వైరస్ లక్షణాలతో సుమారు 60 వేల వరకు బ్రాయిలర్, దేశీ రకం కోళ్లు మృత్యువాత పడ్డాయి. చనిపోయిన కోళ్ల నుంచి నమూనాలను సేకరించిన అధికారులు వారం క్రితం హైదరాబాద్ ల్యాబ్‌కు పంపించారు. ఇంత వరకు అది ఏ వైరస్ అనేది నిర్ధారణ కాలేదు. కోళ్ల ఫారాల్లో జీవ సంరక్షణ చర్యల ద్వారా కొంతవరకు వైరస్ అదుపులోకి వచ్చినట్లు అధికారులు చెబుతున్నారు. మరో వైపు ఏపీలో బర్డ్ ఫ్లూ అలర్ట్ రావడంతో జిల్లాలో కూడా అదే వైరస్‌తో కోళ్లు మరణించి ఉంటాయని ప్రజలు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. అయితే వైరస్ కారణంగా కొన్ని రోజులపాటు చికెన్ తినకూడదని ప్రభుత్వం ప్రకటించిందంటూ మంగళవారం సోషల్ మీడియాలో వార్తలు చక్కర్లు కొట్టాయి. ఇది చికెన్ సెంటర్లపై ప్రభావం చూపింది. చికెన్ అమ్మకాలు తగ్గినట్లు వ్యాపారులు తెలిపారు.



పొతంగల్ మండలం చేతన్‌నగర్‌లోని ఫారంలో మృతి చెందిన కోళ్లు (ఫైల్)

లిఫ్ట్‌ల నిర్వహణకు నిధులు

- లక్ష్మికాలువ ఎత్తిపోతలకు మంచి రోజులు
- మూడేళ్లకు రూ.10.47 కోట్లు విడుదల

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నుంచి నీటిని సరఫరా చేసే లక్ష్మి కాలువపై నిర్మించిన ఎత్తిపోతల పథకాల(లిఫ్ట్‌లు) నిర్వహణకు ప్రభుత్వం రూ.10 కోట్ల 47 లక్షల 40 వేలు మంజూరు చేసింది. ఎత్తిపోతల పథకాల నిర్వహణకు నిధులు మంజూరు చేస్తామని రెండు నెలల క్రితం రాష్ట్ర భారీ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి ప్రకటించిన విషయం తెలిసిందే. నిధుల మంజూరుపై ఆయకట్టు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



లక్ష్మి ఎత్తిపోతల పథకం

ప్రాజెక్ట్ నుంచి నీటిని సరఫరా చేసే లక్ష్మి కాలువను 1064 అడుగుల నీటి మట్టం వద్ద నిర్మించగా, ప్రాజెక్టులో నీటి మట్టం తగ్గిన సమయంలో ఆయకట్టు చివరి వరకు నీరు అందేది కాదు. ఈ నేపథ్యంలో 2007లో అప్పటి ప్రభుత్వం ప్రణాళిక నిధులతో లక్ష్మి ఎత్తిపోతల పథకాన్ని 1045 అడుగుల నీటి మట్టం వద్ద ప్రాజెక్ట్‌లో నిర్మించింది. ప్రస్తుతం ఆ ఎత్తిపోతల పథకం కూడా మైనర్ ఇరిగేషన్ ఆధ్వర్యంలోకి వచ్చింది. ప్రాజెక్టులోని లిఫ్ట్‌తోపాటు డీ–3 పై నిర్మించిన వేంపల్లి, బోదేపల్లి, నవాబు ఎత్తిపోతల పథకాల నిర్వహణకు మూడేళ్ల కోసం ప్రభుత్వం ఒకేసారి నిధులు విడుదల చేస్తూ వారం రోజుల క్రితం జీవో జారీ చేసింది. టెండర్ ప్రక్రియ పూర్తయితే వేసవిలో మరమ్మతులు చేపట్టి ఖరీఫ్ సీజన్ ప్రారంభం నాటికి ఎత్తిపోతలు సిద్ధంగా ఉండేలా చర్యలు తీసుకోవచ్చని రైతులు అంటున్నారు.

త్వరలోనే టెండర్

లక్ష్మి కాలువ ఎత్తిపోతల పథకంతోపాటు కాలువపై నిర్మించిన ఎత్తిపోతల పథకాల మెయింటెనెన్స్ కోసం ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. త్వరలోనే టెండర్ ప్రక్రియను పూర్తి చేసి పనులు ప్రారంభిస్తాం.

– సురేశ్, డీఈఈ, మైనర్ ఇరిగేషన్, బాల్కొండ

ప్రపంచంలోనే కందకుర్తికి ప్రత్యేక గుర్తింపు

- ఆర్‌ఎస్‌ఎస్ ద్వారానే ఉన్నత స్థానానికి ఎదిగాను
- త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి

రెంజల్(బోధన్): రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ వ్యవస్థాపకులు కేశవ బలిరాం హెడ్గేవార్ పూర్వీకుల స్వస్థలమైన రెంజల్ మండలంలోని కందకుర్తి ప్రపంచంలోని కోట్లాది మందికి మార్గనిర్దేశం చేసిన గ్రామమని త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఆయన గ్రామాన్ని సందర్శించారు. ముందుగా హెడ్గేవార్ పూర్వీకుల స్ఫూర్తి మందిరాన్ని పరిశీలించారు. అనంతరం గ్రామంలోని స్వయంభూవుగా వెలిసిన రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్‌ఎస్‌ఎస్ ద్వారానే తాను త్రిపుర గవర్నర్ స్థాయికి ఎదిగానని అన్నారు. 1963లో బాల్య సేవక్ నుంచి డిగ్రీ వరకు వివిధ స్థాయిల్లో శిక్ష వర్గ వంటి అన్ని రకాల కార్యక్రమాలను పూర్తి చేసుకున్నట్లు తెలిపారు. విద్యార్థి పరిషత్ సిటీ ఆర్గనైజర్‌గా, తర్వాత జనతా పార్టీ ద్వారా రాజకీయ ప్రవేశం ప్రారంభమైందన్నారు.



స్ఫూర్తి కేంద్రం వద్ద త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి

దేశంలోని చిన్న రాష్ట్రాల్లో మూడోది..

దేశంలోని చిన్న రాష్ట్రాల్లో త్రిపుర మూడో రాష్ట్రమని, 40 లక్షల జనాభా, 60 మంది ఎమ్మెల్యేలు ఉంటారని ఇంద్రసేనా రెడ్డి పేర్కొన్నారు. త్రిపురకు మూడు వైపులా బంగ్లా సరిహద్దు 856 కిలోమీటర్లు ఉంటుందన్నారు. అస్సాం, మిజోరాం రాష్ట్రాలు కూడా 150 కిలోమీటర్లు ఉంటాయన్నారు. రాబోయే రోజుల్లో త్రిపుర రాష్ట్రం నార్త్‌ఈస్ట్ ప్రాంతానికి గేట్‌వేగా మారుతుందన్నారు. తనను ఈ స్థాయికి తీసుకువచ్చిన ఆర్‌ఎస్‌ఎస్‌కు కృతజ్ఞుడినై గతంలో కందకుర్తికి రెండు పర్యాయాలు వచ్చానని, గవర్నర్ స్థాయిలో ఇక్కడ జరుగుతున్న అభివృద్ధిని తెలుసుకునేందుకు మూడవ పర్యాయం గ్రామానికి వచ్చినట్లు తెలిపారు. ఆయన వెంట కేశవ సేవా సమితి అధ్యక్షులు సుధాకర్‌రెడ్డి, వాసు, అంకు మహేశ్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మోహన్‌రెడ్డితో పాటు మండల, జిల్లా ప్రతినిధులు ఉన్నారు.

క్లుప్తంగా

సీఎంఆర్‌ఎఫ్‌ చెక్కు అందజేత



మోపాల్‌: మండలంలోని బాడ్సి గ్రామానికి చెందిన పోగుల రవీందర్‌కు మంజూరైన సీఎం ఆర్‌ఎఫ్‌ చెక్కును పీసీసీ డెలిగేట్‌ బాడ్సి శేఖర్‌గౌడ్‌ మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎంఆర్‌ఎఫ్‌ బాధితులకు వరంలాంటిదన్నారు. కార్యక్రమంలో పార్టీ గ్రామ అధ్యక్షుడు జగదీశ్‌ రెడ్డి, మాజీ ఎంపీటీసీ మల్లయ్య, లింగం తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ




జక్రాన్‌పల్లి: మండలంలోని మునిపల్లి మాజీ సర్పంచ్‌ చిన్న సాయారెడ్డి తండ్రి ముస్కు బొర్రన్న గుండెపోటుతో మంగళవారం మృతి చెందాడు. బొర్రన్న మృతదేహానికి ఎమ్మెల్యే భూపతిరెడ్డి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఐడీసీఎంఎస్‌ మాజీ చైర్మన్‌ సాయారెడ్డికి మృతుడు బొర్రన్న అన్న కావడంతో ఇరువురిని ఎమ్మెల్యే పరామర్శించారు. పీసీసీ డెలిగేట్‌ శేఖర్‌గౌడ్‌, డీసీసీ ప్రధాన కార్యదర్శి భాస్కర్‌రెడ్డి, నాయకులు గడ్కోల్‌ భాస్కర్‌రెడ్డి, నర్సారెడ్డి, చిన్నారెడ్డి, వసంత్‌రావు, జి తేందర్‌ తదితరులు ఉన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

నిజామాబాద్‌ రూరల్‌: నగరంలో తాళం వేసిన ఓ ఇంట్లో చోరీ జరిగినట్లు పోలీసులు తెలిపారు. వివరాలు ఇలా.. నగరంలోని కంఠేశ్వర్‌ బైపాస్‌ రోడ్డు సమీపంలో నివాసం ఉండే శేఖర్‌ ఇంటికి తాళం వేసి, కుటుంబసభ్యులతో కుంభమేళాకు వెళ్లాడు. సోమవారం రాత్రి ఇంటికి తాళం ఉండడంతో గుర్తుతెలియని దుండగులు ఇంట్లోకి చొరబడి చోరీ చేశారు. మరుసటి రోజు ఉదయం స్థానికులు చోరీని గమనించి వారి కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. వారు పోలీసులకు సమాచారం ఇవ్వగా, ఘటనస్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. ఇంట్లోని రెండు తులాల బంగారం, రూ.40వేల నగదు ఎత్తుకెళ్లారని పోలీసులు తెలిపారు. ఈమేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

పెరగనున్న బీర్ల ధరలు



- ఒక్కో బీరుపై 15 శాతం
- నేడో, రేపో వెలువడనున్న ఉత్తర్వులు
- డిపోలకు నిలిచిన సరఫరా
- గతేడాది బీర్ల అమ్మకాలతో ఎక్సైజ్‌ శాఖకు రూ.120 కోట్ల ఆదాయం

ఖలీల్‌వాడి: వేసవికి ముందే బీరు ప్రియులకు షాక్‌ తగలనుంది. బీర్ల ధర పెంపునకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్‌ ఇచ్చినట్లు తెలుస్తోంది. ధరల నిర్ధారణ కమిటీ ఇచ్చిన నివేదిక ఆధారంగా ధరలు పెంచేందుకు నిర్ణయం తీసుకున్నట్లు రాష్ట్ర ఎక్సైజ్‌ శాఖ ఉత్తర్వుల్లో పేర్కొన్నట్లు తెలిసింది. బీరుపై 15 శాతం ధర పెంపునకు ప్రభుత్వం అనుమతి ఇచ్చినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం లైట్‌ బీరు రూ.150 ఉండగా రూ.172.50 లేదా 180 వరకు పెరిగే అవకాశం ఉంది. స్ట్రాంగ్‌ బీరు రూ.160 ఉండగా పెరిగే ధర ప్రకారం రూ.190 అయ్యే అవకాశం ఉన్నట్లు తెలిసింది.

ఉత్తర్వులు వచ్చేవరకు ప్రస్తుత ధరలే..

బీర్ల ధరల పెంపుపై నేడో, రేపో ఉత్తర్వులు వచ్చే అవకాశాలు ఉన్నట్లు ఎక్సైజ్‌ వర్గాలు తెలిపాయి. ఉత్తర్వులు వచ్చే వరకు వైన్స్‌లు, బార్లలో ప్రస్తుత ధరకే అమ్మకాలు సాగిస్తున్నారు. అయితే, పాత స్టాక్‌ అమ్ముడుపోయే వరకు పాత ధరలకే విక్రయించాలని ఎక్సైజ్‌ అధికారులు సూచించినట్లు తెలిసింది. బీర్ల ధరలు పెరగనున్న నేపథ్యంలో జిల్లాలోని మాక్లూర్‌ మండలం మాదాపూర్‌లో ఉన్న ఐఎంఎల్‌ డిపోకు బీర్ల కంపెనీలు సరఫరాను నిలిపివేశాయి.

లిక్కర్‌ ద్వారానే అధిక ఆదాయం

జిల్లాలో మొత్తం 102 వైన్స్‌లు, 17 బార్లు ఉన్నాయి. గతేడాది జిల్లాలో మొత్తం 20,36,435 బీర్ల కేసులు(బాక్సులు) అమ్ముడుపోగా ఎక్సైజ్‌ శాఖకు రూ.120 కోట్ల ఆదాయం వచ్చింది. జిల్లాలో బీర్లు, లిక్కర్‌ అమ్మకాలతో నెలకు రూ.96 కోట్ల నుంచి రూ.100 కోట్లు, ఏడాదికి రూ.1127.42 కోట్ల ఆదాయం వస్తుంది. జిల్లాలో బీర్ల కంటే ఎక్కువగా లిక్కర్‌ ద్వారానే ఆదాయం వస్తున్నట్లు ఎక్సైజ్‌ వర్గాల ద్వారా తెలిసింది.

వివిధ కంపెనీల బీర్ల ధరలు

బీరు	ప్రస్తుత ధర	పెరిగే ధర
కేఎఫ్‌ లైట్‌	150	172.50 లేదా 180
కేఎఫ్‌ ప్రీమియం	160	184
హేవార్డ్స్‌	160	184
టూబర్గ్‌ లైట్‌	185	212.75
కేఎఫ్‌ అల్ట్రా	210	241.50
బడ్వైజర్‌ లైట్‌	210	241.50
కేఎఫ్‌ అల్ట్రామ్యాక్స్‌	220	253
బడ్వైజర్‌ మ్యాగ్నం	220	253
టూబర్గ్‌ స్ట్రాంగ్‌	240	276

ఉత్తర్వులు అందలేదు

బీర్ల ధరల పెంపుపై ఎలాంటి ఉత్తర్వులు అందలేదు. ఉత్తర్వులు వచ్చిన తర్వాత స్పష్టత ఇస్తాం. ఐఎంఎల్‌ డిపోకు బీర్లు రావటం లేదు. వైన్స్‌, బార్లల్లో ఉన్న బీర్లను పాత రేటు ప్రకారం విక్రయించాలి.

– మల్లారెడ్డి, ఎక్సైజ్‌ సూపరింటెండెంట్‌, నిజామాబాద్‌

ఎండాకాలంలో బీర్ల అమ్మకాలు ఎక్కువ...

ఎండాకాలంలో మద్యంప్రియులు బీర్లు తాగేందుకే ఆసక్తి చూపుతారు. అందుకు గతేడాది మార్చి నుంచి మే వరకు అమ్ముడుపోయిన బీర్ల కేసులే నిదర్శనంగా చెప్పవచ్చు. రోజుకు సుమారు 8 వేల కేసుల చొప్పున, 6 లక్షల కేసుల బీర్లు అమ్ముడయ్యాయి. ప్రస్తుతం ఎక్సైజ్‌ శాఖ బీర్ల ధరను పెంచితే అమ్మకాలు ఎలా జరుగుతాయనే సందేహాలు లిక్కర్‌ వ్యాపారుల్లో నెలకొన్నాయి.

సద్గుణ వికాసమే ఆర్‌ఎస్‌ఎస్‌ లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న లింగం శ్రీధర్‌

సుభాష్‌నగర్‌: సద్గుణ వికాసమే శాఖ లక్ష్యమని ఆర్‌ఎస్‌ఎస్‌ తెలంగాణ ప్రాంత ప్రచారక్‌ లింగం శ్రీధర్‌ పేర్కొన్నారు. నగరంలోని వినాయక్‌నగర్‌లో మంగళవారం నిర్వహించిన సంకట విమోచన శాఖ వార్షికోత్సవానికి ఆయన ముఖ్య వక్తగా పాల్గొని మాట్లాడారు. రాష్ట్రీయ స్వయం సేవక్‌ సంఘ్‌ ప్రచారం కోసం కాకుండా ప్రజల మేలు కోసం, దేశ హితం కోసం పని చేస్తుందన్నారు. వార్షికోత్సవంలో విభాగ్‌ ప్రచారక్‌ శివకుమార్‌, జిల్లా కార్యవాహ డాక్టర్‌ వారె దస్తగిరి, నగర కార్యవాహ అర్గుల సత్యం, స్వయం సేవకులు, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

గరుడ వాహనంపై విహరించిన సీతారాములు



గరుడ వాహన సేవ నిర్వహిస్తున్న భక్తులు

డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్‌): మండలంలోని డిచ్‌పల్లి ఖిల్లా రామాలయం బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. వేడుకల్లో భాగంగా మంగళవారం హోమం, బలిహరణం సహా పలు పూజా కార్యక్రమాలు నిర్వహించినట్లు ఆలయ ప్రధానార్చకులు సుమిత్‌ శర్మ దేశ్‌పాండే తెలిపారు. రాత్రివేళ సీతారామచంద్ర స్వామితోపాటు లక్ష్మణుడు, హనుమంతుడి ఉత్సవ విగ్రహాలను గరుడ వాహనంపై ఉంచి గ్రామంలోని ప్రధాన వీధుల్లో ఊరేగించారు. మహిళలు మంగళహారతులతో స్వామివారికి స్వాగతం పలికారు. నేడు రథోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు.

కళ్లలో కారం కొట్టి చోరీకి యత్నం

బోధన్‌టౌన్‌(బోధన్‌): బోధన్‌లోని శక్కర్‌నగర్‌ కాలనీలో కళ్లలో కారం చల్లి ఓ మహిళ చోరీకి యత్నించిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. సీఐ వెంకట నారాయణ తెలిపిన వివరాలు ఇలా.. శక్కర్‌నగర్‌ కాలనీకి చెందిన స్వప్న ఇంట్లోనే చీరల దుకాణం ఏర్పాటు చేసుకొని వ్యాపారం నిర్వహిస్తోంది. ఈక్రమంలో చీరలు కొనడానికి ఓ మహిళ బురఖాలో ఆమె వద్దకు వచ్చి, కొన్ని చీరలను సెలక్ట్‌ చేసుకుంది. వాటిని స్వప్న ప్యాక్‌ చేస్తుండగా సదరు మహిళ తన వెంట తెచ్చిన కారంపొడిని ఆమె కళ్లలోకి చల్లి, కత్తితో బెదిరిస్తూ బంగారు గొలుసును లాగడానికి యత్నించింది. స్వప్న కేకలు వేయడంతో ఆమె కౌంటర్‌లో ఉన్న సుమారు రూ.40వేల నగదును పట్టుకొని పారిపోతుండగా స్థానికులు పట్టుకొని దేహశుద్ధి చేశారు. పోలీసులకు సమాచారం అందించగా వారు మహిళను విచారించారు. నిందితురాలు తన పేరు శోభ అని తెలిపిందన్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

సంక్షిప్తం

ఇంటర్‌నెట్‌ వినియోగంపై అవగాహన

నిజామాబాద్‌అర్బన్‌: నగరంలోని కలెక్టరేట్‌లో మంగళవారం సేఫర్‌ ఇంటర్నెట్‌ డే సందర్భంగా ఇంటర్‌నెట్‌ వినియోగంపై జిల్లా ఇన్ఫర్మేటిక్స్‌ అధికారి మధు అవగాహన కల్పించారు. అదేవిధంగా సైబర్‌ మోసాల గురించి వివరించారు. అనంతరం ఐడీవోసీ పాలనాధికారి ప్రశాంత్‌ మాట్లాడుతూ.. సైబర్‌ మోసాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

సబ్‌ స్టేషన్‌ ఆపరేటర్‌ సస్పెన్షన్‌

ఆర్మూర్‌: నందిపేట సెక్షన్‌లోని సబ్‌ స్టేషన్‌ ఆపరేటర్‌ సీహెచ్‌ గంగాధర్‌ను సస్పెండ్‌ చేస్తున్నట్లు నిజామాబాద్‌ డివిజన్‌ ఇంజినీర్‌ ఎం శ్రీనివాస్‌ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. సోమవారం మద్యం మత్తులో అతడు విధులకు హాజరు కావడంతోపాటు నిర్లక్ష్యంగా ఉండటంతో ఆయనపై చర్యలు తీసుకున్నారు.

ఆరుగురు టీచర్లకు షోకాజ్‌ నోటీసులు

నిజామాబాద్‌అర్బన్‌: ఎన్నికల శిక్షణకు గైర్హాజరైన ఆరుగురు టీచర్లకు షోకాజ్‌ నోటీసులు జారీ అయ్యాయి. ఈ నెల 10న నిర్వహించిన ఎన్నికల శిక్షణ కార్యక్రమానికి హాజరుకాని ఉపాధ్యాయులకు కలెక్టర్‌ రాజీవ్‌గాంధీ హనుమంతు ఆదేశాల మేరకు మంగళవారం షోకాజ్‌ నోటీసులు జారీ చేసినట్లు డీఈవో అశోక్‌ తెలిపారు. నోటీసులు అందుకున్న వారిలో ధర్మారం ఉన్నత పాఠశాల హెచ్‌ఎం సంధ్యానాయక్‌, స్కూల్‌ అసిస్టెంట్లు లక్ష్మీనాథం, నారాయణ, హుస్సేన్‌ బుకారి, సాయిలు, స్వామికుమార్‌ ఉన్నారు.

తెయూలో సేవాలాల్‌ జయంతి నిర్వహించాలి

తెయూ(డిచ్‌పల్లి): బంజారాల ఆరాధ్యుడు సంత్‌ శ్రీసేవాలాల్‌ జయంతిని తెలంగాణ యూనివర్సిటీలో ఘనంగా నిర్వహించాలని గిరిజన శక్తి విద్యార్థి సంఘం నాయకులు కోరారు. మంగళవారం వారు వీసీ యాదగిరిరావుకు వినతిపత్రం అందజేశారు.

మహిళలు ఆర్థికంగా అభివృద్ధి సాధించాలి

జక్రాన్‌పల్లి: మహిళలు ఆర్థికంగా అభివృద్ధి సాధించాలని భారతీయ కిసాన్‌ సంఘ్‌ అఖిల భారతీయ కార్యదర్శి సాయారెడ్డి అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం ఉమెన్స్‌ ఫార్మర్స్‌ ప్రొడ్యూసర్స్‌ కో–ఆపరేటివ్‌ సొసైటీ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. ఏవో దేవిక, సొసైటీ చైర్మన్‌, డైరెక్టర్లు పాల్గొన్నారు.

ఇద్దరి బైండోవర్‌

సిరికొండ: అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న మండల కేంద్రానికి చెందిన పారిపల్లి వరుణ్‌, మొట్టల సతీష్‌ను మంగళవారం తహసీల్దార్‌ రవీందర్‌రావు ఎదుట బైండోవర్‌ చేసినట్లు ఎస్సై రామ్‌ తెలిపారు. ఎవరైన ఇసుక అక్రమ రవాణా చేసినట్లయితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై తెలిపారు.

90 కిలోల గంజాయి పట్టివేత

- ముగ్గురిపై కేసు నమోదు



పట్టుకున్న గంజాయితో ఎక్సైజ్‌ అధికారులు

బాన్సువాడ: బాన్సువాడ ఎక్సైజ్‌ సర్కిల్‌ కార్యాలయం పరిధిలోని నిజాంసాగర్‌ మండలం మాగి చౌరస్తా వద్ద 90.830 కిలోల గంజాయిని పట్టుకున్నట్లు నిజామాబాద్‌ డీసీ సోమిరెడ్డి తెలిపారు. బాన్సువాడ ఎక్సైజ్‌శాఖ కార్యాలయం వద్ద పట్టుకున్న గంజాయితోపాటు నిందితుల వివరాలను మంగళవారం వారు వెల్లడించారు. నల్లగొండ జిల్లా గుండాల మండలం అంబాల గ్రామానికి చెందిన పాలపు తిరుపతి, కరీంనగర్‌ జిల్లా జెమినితండాకు చెందిన గెలోత్‌ సత్నమ్‌, గాంధారికి చెందిన శ్రీనివాస్‌లు స్కార్పియో వాహనంలో గంజాయిని తరలిస్తున్నారని పోలీసులకు సమాచారం అందింది. దీంతో వారు వాహనాన్ని తనిఖీ చేయగా రూ.22.50 లక్షలు విలువ గల 90.830 కిలోల గంజాయి లభ్యమైనట్లు తెలిపారు. కర్ణాటకలోని నాగిలి నుంచి జహీరాబాద్‌ మీదుగా నాందేడ్‌కు తరలిస్తున్నారని, నిందితులు తిరుపతి, సత్నమ్‌లను అదుపులోకి తీసుకున్నామన్నారు. శ్రీనివాస్‌ పరారీలో ఉన్నాడని వివరించారు. ముగ్గురిపై కేసు నమోదు చేశామన్నారు. ఈఎస్‌ హన్మంత్‌రావు, ఏఈఎస్‌ డీసీబీ నాయక్‌, సిబ్బంది స్వప్న, రాంకుమార్‌, శరత్‌ కుమార్‌, విష్ణు, అవినాష్‌, సందీప్‌ ఉన్నారు.

బావిలో పడి బాలుడి మృతి



లక్ష్మణ్‌(ఫైల్‌)

ఇందల్వాయి: ప్రమాదవశాత్తు బావిలో జారిపడి బాలుడు మృతిచెందిన ఘటన డొంకల్‌ గ్రామ పరిధిలోని డొంకల్‌ తండాలో మంగళవారం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ఇలా.. తండాకు చెందిన గోవింద్‌–రేణా దంపతుల కొడుకు లక్ష్మణ్‌(13).. చదువు మానేసి ఇంటి వద్దే ఉంటున్నాడు. మంగళవారం స్నేహితులతో కలిసి అతడు మేకలను మేపేందుకు వెళ్లగా దూలగొండి ఆకు తాకడంతో సమీపంలో ఉన్న బావి వద్ద వెళ్లాడు. నీటిలో అతడు కడుక్కుంటుండగా ప్రమాదవశాత్తు జారిపడ్డాడు. గమనించిన స్నేహితులు తండావాసులకు సమాచారం ఇవ్వగా, వారు వచ్చేలోపు లక్ష్మణ్‌ మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించి, తల్లి రేణా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై మనోజ్‌ తెలిపారు.

పదో తరగతి విద్యార్థిని ఆత్మహత్య



సంజన మృతదేహం

కామారెడ్డి క్రైం: పట్టణంలోని డ్రైవర్స్‌ కాలనీకి చెందిన ఓ పదో తరగతి విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడింది. వివరాలు ఇలా.. కాలనీకి చెందిన మెరికాడి లక్ష్మీ–పోశెట్టి దంపతులకు కుమార్తె సంజన (15), ఓ కుమారుడు ఉన్నారు. సంజన స్థానికంగా ఉన్న ఓ పాఠశాలలో పదో తరగతి చదువుకుంటుంది. ఆమె పది రోజుల నుంచి స్కూల్‌కు వెళ్లడం లేదనీ, సరిగా చదవడం లేదనీ టీచర్‌ ద్వారా తెలియడంతో తల్లి కుమార్తెను మందలించింది. దీంతో మనస్తాపం చెందిన సంజన ఇంట్లో ఎవరూలేని సమయంలో చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. సమాచారం అందుకున్న దేవునిపల్లి పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించి విచారణ జరిపారు. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై రాజు తెలిపారు.

క్రైం కార్నర్‌

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

సదాశివనగర్‌(ఎల్లారెడ్డి): మండల కేంద్రం శివారులోగల ఓ వ్యవసాయ బావిలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని గ్రామస్తులు మంగళవారం గుర్తించారు. వారు పోలీసులకు సమాచారం అందించగా ఘటన స్థలానికి చేరుకున్నారు. కొంతమంది బావి వద్దకు ఈత కోసం వచ్చి స్నానం చేస్తుండగా అతడు నీటమునిగి మృతిచెంది ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. మృతుడు ఇతర రాష్ట్రానికి చెందినవాడు కావచ్చని, వయస్సు సుమారు 20 నుంచి 30 సంవత్సరాల వరకు ఉంటుందని ఎస్సై రంజిత్‌ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి ఆచూకీ లభించిన వారు 8712686164ను సంప్రదించాలని ఎస్సై తెలిపారు.

వర్క్‌ఫ్రం హోం పేరిట సైబర్‌ మోసం

నవీపేట: మండలంలోని ఓ వ్యక్తిని సైబర్‌ మోసగాళ్లు వర్క్‌ఫ్రం హోం పేరిట బురిడీ కొట్టించి, సుమారు రూ.2లక్షలకు పైగా టోకరా వేశారు. ఎస్సై వినయ్‌ తెలిపిన వివరాలు ఇలా.. మండలంలోని ఫతేనగర్‌ గ్రామానికి చెందిన మహమ్మద్‌ సోహెల్‌కు గతేడాది జూలై 10న టెలిగ్రామ్‌యాప్‌లో అన్య సమీరా ప్రొఫైల్‌ నుంచి వర్క్‌ ఫ్రం హోం మెసేజ్‌ వచ్చింది. లింకును ఓపెన్‌ చేయగా కొద్దిమేర డిపాజిట్‌ చేస్తే ఈజీగా సంపాదించుకోవచ్చు అని నమ్మించారు. దీంతో జూలై 12న రూ. 1000 డిపాజిట్‌ చేయగా సోహెల్‌ ఎకౌంట్లోకి రూ. 1500లు వచ్చాయి. ఇలా పలుపార్లు కొంత సొమ్మును డిపాజిట్‌ చేయగా అధికంగా డబ్బులు వచ్చాయి. దీంతో డిసెంబర్‌ 30న రూ. 15,000లు, జనవరి 1న మరో రూ. 50,000లు డిపాజిట్‌ చేశాడు. ఎలాంటి డబ్బు జమ కాకపోవడంతో అనుమానం వచ్చి నిర్వాహకులను ప్రశ్నించాడు. అకౌంట్‌ ఫ్రీజ్‌ అయిందని డబ్బులు ఎక్కడికిపోవని వారు నమ్మించారు. దీంతో సోహెల్‌ జనవరి 29న మరో రూ. 1,50,000లను డిపాజిట్‌ చేశారు. డబ్బులు తిరిగి రాకపోవడంతో మోసపోయానని తెలుసుకొని మంగళవారం పోలీసులను ఆశ్రయించాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కారు అమ్మకం పేరిట..

నవీపేట మండలంలోని శాఖాపూర్‌ గ్రామానికి చెందిన కాడ మారుతి సెకండ్‌ హ్యాండ్‌ కారు కొనుగోలు చేద్దామని సైబర్‌ మోసగాళ్ల చేతిలో మోసపోయాడు. ఎస్సై వినయ్‌ తెలిపిన వివరాలు ఇలా.. గత నెల 25న మారుతికి ఫేస్‌బుక్‌ అకౌంట్లో ఆల్టో కారు అమ్మబడునని మెసేజ్‌ రాగా ఫాలో అయ్యాడు. అతడికి వెంటనే గుర్తుతెలియని వ్యక్తి తన కారును అమ్మి వేస్తానని ఫోన్‌ చేసి, నమ్మించాడు. దీంతో అతడు రూ. 42,000 పంపించాడు. అక్కడి నుంచి ఎలాంటి స్పందన రాకపోవడంతో మోసపోయానని తెలుసుకొని, పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వారు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కొడుకు పెళ్లి చూడకుండానే తండ్రి మృత్యువాత

- మొరం టిప్పర్‌ ఢీకొట్టడంతో మరణించిన వైనం
- తాడ్వాయి మండలకేంద్రంలో ఘటన



మైశయ్య (ఫైల్‌)



రోదిస్తున్న కుటుంబీకులు, బంధువులు

తాడ్వాయి(ఎల్లారెడ్డి): త్వరలో కొడుకు పెళ్లి.. ఇంతలో తండ్రి రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన ఘటన తాడ్వాయి మండల కేంద్రంలో చోటుచేసుకుంది. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. తాడ్వాయికి చెందిన కీసరి మైశయ్య(55) జీపీ కార్మికుడిగా పనిచేస్తుండేవాడు. మంగళవారం తన ఇంటి నుంచి పాతబస్టాండ్‌ చౌరస్తాకు నడుచుకుంటూ వెళ్తుండగా, మొరం టిప్పర్‌ అతివేగంగా వచ్చి ఢీకొట్టింది. టైర్లు మైశయ్యపై వెళ్లడంతో శరీరభాగాలు నుజ్జునుజ్జుఅయ్యాయి. అందరితో కలుపుగోలుగా ఉండే మైశయ్య అకస్మాత్తుగా రోడ్డుప్రమాదంలో మృతిచెందడంతో కుటుంబీకులు, బంధువుల రోదనలు మిన్నంటాయి. 13 రోజుల తర్వాత మైశయ్య కుమారుడి పెండ్లి ఉందని, తన కొడుకు పెండ్లి చూడకుండనే మృతిచెందినాడని వారు ఆవేదన వ్యక్తం చేశారు. టిప్పర్లు ప్రతిరోజు అక్రమంగా మొరంను తరలిస్తూ, అనుభవం లేని డ్రైవర్లు అజాగ్రత్తగా నడిపించడంతో తరచుగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. డ్రైవర్‌పై కేసు నమోదుచేసి కఠినంగా శిక్షించి, బాధితకుటుంబాన్ని ఆదుకోవాలని కోరుతున్నారు. డ్రైవర్‌ పరారీలో ఉన్నారు. పోలీసులు ఘటన స్థలానికి వచ్చి కేసు నమోదు చేసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించారు.

అనారోగ్యంతో వ్యక్తి..



శంకర్‌ (ఫైల్‌)

ఎల్లారెడ్డి: మహా కుంభమేళాకు వెళ్లి అనారోగ్యానికి గురైన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. కుటుంబసభ్యులు తెలిపిన వివరాలు ఇలా.. ఎల్లారెడ్డికి చెందిన మంగళి శంకర్‌ (47) మూడు రోజుల క్రితం మహా కుంభమేళా కోసం ప్రయాగ్‌రాజ్‌కు కుటుంబ సభ్యులతో వెళ్లాడు. అక్కడ అతడు అనారోగ్యానికి గురికావడంతో ఉత్తరప్రదేశ్‌ రాష్ట్రంలోని లక్నో ఆస్పత్రికి చికిత్స కోసం తరలించారు. పరిస్థితి విషమించి చికిత్స పొందుతూ అతడు మృతి చెందాడు. మృతదేహం మంగళవారం రావడంతో నాగిరెడ్డిపేట మండలంలోని పోచారం గ్రామంలో అంత్యక్రియలు నిర్వహించినట్లు స్థానికులు తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడు..



రుద్రూర్‌: మండలంలోని అక్బర్‌నగర్‌ గ్రామంలో మేత్రిన్‌ రాజ్‌కుమార్‌ (35) అనే యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. రాజ్‌కుమార్‌ తరచూ మద్యం తాగి కుటుంబ సభ్యులతో గొడవ పడేవాడు. దీంతో భార్య మాలశ్రీ ఐదు నెలల క్రితం ఇద్దరు పిల్లలను తీసుకొని పుట్టింటికి వెళ్లిపోయింది. అప్పటి నుంచి ఇంట్లో ఒక్కడే ఉండి అతిగా మద్యం తాగేవాడు. మంగళవారం సాయంత్రం అతడు ఇంట్లో మృతిచెంది ఉండగా స్థానికులు గుర్తించి కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. అతిగా మద్యం తాగి మృతి చెందాడా, లేదా ఏదైనా పురుగుల మందు తాగి మృతి చెంది ఉంటాడని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మృతుడి తండ్రి బసప్ప ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సాయన్న తెలిపారు.

పేకాడుతున్న ఏడుగురి అరెస్ట్‌

కమ్మర్‌పల్లి : మండల కేంద్రం శివారులో పేకాట ఆడుతున్న ఏడుగురు వ్యక్తులను అరెస్ట్‌ చేసినట్లు ఎస్సై అనిల్‌రెడ్డి మంగళవారం తెలిపారు. మెట్‌పల్లి రోడ్‌లోని పల్లె చెరువు దిగువ అలుగు సమీపంలోని ఈత వనంలో పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు పోలీస్‌ సిబ్బందితో వెళ్లి స్థావరంపై దాడి చేశారు. పేకాట ఆడుతున్న ఏడుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకోవడంతో పాటు, వారి వద్ద నుంచి రూ. 30,630 నగదు, 7 సెల్‌ఫోన్‌లు, 4 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

వైరస్‌తో మరో 6వేల కోళ్లు మృతి



బాన్సువాడ రూరల్‌: మండలంలోని బోర్లం క్యాంపులో మంగళవారం బోడ చందర్‌ అనే పౌల్ట్రీ రైతు కోళ్లఫారంలో అంతుచిక్కని వైరస్‌తో 6వేల కోళ్లు మృతి చెందాయి. ఆదివారం 2వేల కోళ్లు మృతి చెందగా మంగళవారం నాటికి వాటి సంఖ్య 8వేలకు చేరింది. చేతికొచ్చిన కోళ్లను మార్కెట్‌కు తరలించే సమయానికి మృతిచెందడంతో తీవ్ర నష్టం వాటిల్లుతోందని పౌల్ట్రీరైతు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని వేడుకున్నారు.

వివిధ ఘటనల్లో పలువురికి జైలు శిక్ష

ఆర్మూర్‌: మామిడిపల్లి పరిధి ఆదర్శనగర్‌ కాలనీలో మట్కా నిర్వహిస్తున్న గుజరాతి గోవర్ధన్‌కు సెకండ్‌ క్లాస్‌ మెజిస్ట్రేట్‌ ఏడు రోజుల సాధారణ జైలు శిక్షతో పాటు రూ. 2వేల జరిమానా విధించినట్లు ఆర్మూర్‌ ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ గౌడ్‌ మంగళవారం తెలిపారు. గత నెల 20న మట్కా ఆడుతున్న ఆరుగురిని పక్కా సమాచారం మేరకు అదుపులోకి తీసుకున్నట్లు ఎస్‌హెచ్‌వో వివరించారు. వీరి వద్ద నుంచి రూ.28వేలతో పాటు 3సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. సెకండ్‌ క్లాస్‌ మెజిస్ట్రేట్‌ ఎదుట వారిని హాజరు పర్చగా మట్కా నిర్వాహకుడితో పాటు మట్కా ఆడుతూ పట్టుబడ్డ రాచర్ల నర్సయ్య, శేఖర్‌, మందాల రాజారాం, ఆటో మహేష్‌, షేక్‌వలికి రూ. వెయ్యి చొప్పున జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారని పేర్కొన్నారు.

అటవీ భూమి కబ్జా కేసులో ముగ్గురికి..

వర్ని: వర్ని అటవీ రేంజ్‌ పరిధిలోని కునిపూర్‌ శివారులో రెండున్నర ఎకరాల అటవీ భూమిని కబ్జా చేసిన కేసులో ముగ్గురు వ్యక్తులకు న్యాయమూర్తి నాలుగు రోజుల రిమాండ్‌ విధించినట్లు జలాల్‌పూర్‌ ఫారెస్ట్‌ సెక్షన్‌ ఆఫీసర్‌ ప్రభాకర్‌ వెల్లడించారు. అటవీ భూమిని కబ్జా చేయరాదని అధికారులు హెచ్చరించినా, కోర్టు ఆర్డర్‌ను ధిక్కరించి అటవీ భూమిని సాగు చేసినందుకు జడ్జి నాలుగు రోజుల రిమాండ్‌ విధించినట్లు ఆయన తెలిపారు.

డ్రంకన్‌డ్రైవ్‌ కేసులో..

ఖలీల్‌వాడి: నగరంలోని ఐదో టౌన్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో సోమవారం డ్రంకన్‌డ్రైవ్‌ తనిఖీలు నిర్వహించగా ఇద్దరు మద్యం తాగి పట్టుబడినట్లు ఎస్సై గంగాధర్‌ తెలిపారు. వారిని నిజామాబాద్‌ కోర్టులో మంగళవారం హాజరుపరుచగా జడ్జి రెండు రోజుల శిక్ష విధించారని ఎస్సై తెలిపారు. ఈనెల 8న నగరంలోని ఒకటో టౌన్‌ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలోని నెహ్రూ పార్క్‌ దగ్గర ఎస్‌హెచ్‌వో రఘుపతి డ్రంకన్‌డ్రైవ్‌ తనిఖీలు నిర్వహించగా ఒకరు మద్యం తాగి పట్టుబడ్డారు. అతడిని కోర్టులో హాజరుపర్చగా జడ్జి రెండు రోజుల జైలు శిక్ష విధించినట్లు తెలిపారు. అలాగే ఇటీవల నిర్వహించిన డ్రంకన్‌డ్రైవ్‌ తనిఖీల్లో పట్టుబడిన ఇద్దరికి జైలు శిక్ష, 24 మందికి జరిమానా విధించినట్లు ట్రాఫిక్‌ ఏసీపీ నారాయణ తెలిపారు.

ధర్పల్లి: ధర్పల్లి శివారులోని ఎల్లమ్మ టెంపుల్‌ వద్ద ఇటీవల పోలీసులు డ్రంకన్‌డ్రైవ్‌ తనిఖీలు నిర్వహించగా సీతాయిపేట్‌ గ్రామానికి చెందిన సుధాకర్‌ మద్యం తాగి వాహనం నడుపుతూ పట్టుబడ్డాడు. అతడిని నిజామాబాద్‌ కోర్టులో హాజరుపరుచగా జడ్జి అతడికి రెండు రోజుల జైలు శిక్ష విధించినట్లు పోలీసులు తెలిపారు.

రుద్రూర్‌ మండలంలో..

రుద్రూర్‌: మండల కేంద్రానికి చెందిన షేక్‌ మహబూబ్‌ అనే వ్యక్తి డ్రంకన్‌డ్రైవ్‌ తనిఖీలో ఇటీవల పోలీసులకు పట్టుబడ్డాడు. అతడిని బోధన్‌ కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి ఒక రోజు జైలు శిక్ష విధించారు.

న్యూసెన్స్‌ కేసులో ఒకరికి..

రుద్రూర్‌: రుద్రూర్‌ మండలం రాయకూర్‌ గ్రామానికి చెందిన హబీబ్‌ ఖాన్‌ అనే యువకుడు మద్యం మత్తులో డయల్‌ 100కు అనవసరంగా ఫోన్‌ చేసి పోలీసుల సమయాన్ని వృథా చేసినందుకు నిందితుడికి రెండు రోజుల జైలు శిక్ష పడినట్లు ఎస్సై సాయన్న తెలిపారు. ఈ నెల 9న పలుమార్లు డయల్‌ 100కు అనవసరంగా కాల్‌ చేసి సమయం దుర్వినియోగం చేసినందుకు నిందితుడిపై కేసు నమోదు చేశామన్నారు. మంగళవారం బోధన్‌ కోర్టులో హాజరు పరచగా న్యాయమూర్తి రెండు రోజుల జైలు శిక్ష విధించారన్నారు

సిరికొండ: సిరికొండకు చెందిన ప్రశాంత్‌, శేఖర్‌గౌడ్‌ ఇటీవల మద్యం తాగి వాహనం నడుపుతూ పోలీసులకు పట్టుబడ్డారు. వారిని ఆర్మూర్‌ కోర్టులో హాజరుపర్చగా జడ్జి వారికి రెండు రోజుల జైలుశిక్ష విధించినట్లు ఎస్సై రామ్‌ తెలిపారు.